## క్లుప్తంగా

### నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రొద్దుటూరు : మండలంలోని పాత అమృతానగర్‌లో నివాసం ఉంటున్న పేద కుటుంబానికి వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యావసర సరుకులు అందించారు. రిల్ల నాగలక్ష్మి కుటుంబానికి ఒక నెలకు సరిపడ నిత్యావసర సరుకులు, 25 కేజీల బియ్యం ప్యాకెట్‌ను బత్తల ముబారక్ సహకారంతో అందించినట్లు వికసిత ఫౌండేషన్ చైర్మన్ శూలం లక్ష్మీదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో జాషువా, సుబ్బయ్య, ఆనంద్, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

### పారిశుద్ధ్య పనుల్లో క్లాప్ మిత్ర పాత్ర కీలకం

చాపాడు : గ్రామీణ ప్రాంతాల్లో అపరిశుభ్రతను తొలగించే పనుల్లో క్లాప్ మిత్రల పాత్ర కీలకమని మండల పరిషత్ అధ్యక్షుడు తెలిదెల లక్ష్మయ్య పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని క్లాప్ మిత్రలకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వారు ఆరోగ్యంగా ఉండటం చాలా అవరమన్నారు. ఇలాంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్యాధికారి డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే ఎలాంటి రోగాలు దరిచేరవన్నారు. క్లాప్ మిత్రలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వీరకిశోర్, వైద్యాధికారి డాక్టర్ కావ్య మాధురి, కేసీ కెనాల్ పీసీ వైస్ చైర్మన్ గురివిరెడ్డి, మండల వ్యవసాయాధికారి దేవి పద్మలత, ఈఓపీఆర్డీ శివకుమార్, పీహెచ్ఎన్ సుకన్య, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### నివాళి

బద్వేలు అర్బన్ : వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి, మాస్క్ కమిటీ సెక్రటరీ గౌస్‌బాష (బాబ్జీ) సోదరుడు, వైఎస్సార్‌సీపీ వీరాభిమాని అల్తాఫ్ (40) శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి, నియోజకవర్గ బూత్‌కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సింగసాని గురుమోహన్ తదితరులు అల్తాఫ్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలతో నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో ఏపీ టూరిజం మాజీ డైరెక్టర్ అల్లాబకాష్, వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ ఉమర్, ఆయా వార్డుల ఇన్‌చార్జ్‌లు మౌలాలీ, షఫీ తదితరులు పాల్గొన్నారు.

### వైద్యశిబిరం

కలసపాడు : రాజుపాలెం విలేజ్ హెల్త్ క్లినిక్‌లో స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని స్థానిక సర్పంచ్ రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆరోగ్యవంతమైన మహిళలు శక్తివంతమైన కుటుంబం అనే నినాదంతో అందరు కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ శిబిరంలో అధిక రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ లక్షణాలు గుర్తించడం, గర్భవతులు, బాలింతలకు పరీక్షలు నిర్వహించి మందులు అందచేసి చిన్నపిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. గర్భవతులకు పోషకాహారం అందించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ లక్ష్మి, ఏఎన్‌ఎం నూర్జహాన్, హెల్త్ అసిస్టెంట్ రామతీర్థం, 104 సిబ్బంది పద్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

### నూతన వధూవరులకు ఆశీర్వాదం

చాపాడు : మండల పరిధిలోని చిన్నగురవలూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పెడమళ్ల టామ్ కుమార్తె అమృత, జాన్‌ల వివాహ వేడుకను శుక్రవారం మైదుకూరులోని శ్రీనివాస కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ వేడుకలో మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శివారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, నాగసుబ్బారెడ్డి తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

### అనారోగ్యంతో వ్యక్తి మృతి

పోరుమామిళ్ల : పట్టణంలోని శ్రీ రామచంద్రా రిక్రియేషన్ క్లబ్‌లో శుక్రవారం మృతి చెందిన వ్యక్తి గిరినగర్‌కు చెందిన బాలశౌరి(45) అని ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. ముందుగా గుర్తు తెలియని వ్యక్తిగా, అనుమానాస్పద మృతిగా ప్రచారం జరిగిందని, అయితే అతను గిరినగర్ వాసిగా తెలియడంతో ఊహాగానాలకు తెర పడిందన్నారు. మృతి చెందిన విషయాన్ని బంధువులకు తెలియజేయడంతో శవాన్ని తీసుకెళ్లారని ఎస్ఐ చెప్పారు.

### ప్రతి డ్వాక్రా గ్రూపునకు రూ.1,500 జమ

ఖాజీపేట : డ్వాక్రా సభ్యుల సహకారంతో ఖాజీపేటలో ఏర్పాటు చేసిన మహిళా మార్టులో వచ్చిన ఆదాయంను సభ్యులకు ఇచ్చామని ఏపీఎం శైలజా తెలిపారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. మండలంలో 2022 నంబర్ 28న 848 గ్రూపుల నుంచి రూ.3వేలు చొప్పున పెట్టుబడి నిధిని సేకరించామన్నారు. అలా సేకరించిన డబ్బుతో మహిళా మార్టును ఏర్పాటు చేశామన్నారు. దీని వల్ల 2025 జులై నాటికి రూ.12,72,300 ఆదాయం వచ్చిందన్నారు. వచ్చిన ఆదాయంను పెట్టుబడి పెట్టిన డ్వాక్రా గ్రూపు సభ్యులకు ప్రతి గ్రూపునకు రూ.1500 లాభంను ఇచ్చామన్నారు. మాజీ సీఎం జగన్ ఎంతో ముందు చూపుతో ఏర్పాటు చేసిన మహిళా మార్టు లాభాల్లో నడవడం చాలా సంతోషకరంఅని వైఎస్సార్ సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ పీవీ రాఘవరెడ్డి, మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి అన్నారు.

బ్రహ్మంగారిమఠం : శ్రీ లలితాదేవిగా శ్రీ ఈశ్వరీమాత



ప్రొద్దుటూరు : ముక్తిరామలింగేశ్వర స్వామి ఆలయంలో పార్వతీదేవి



ప్రొద్దుటూరు : సత్యనారాయణ స్వామి ఆలయంలో వైష్ణవి దేవి



కాశినాయన: లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానంలో పార్వతిదేవి అలంకారం



కలసపాడు: వనవిహారిణిదేవి అలంకారంలో కన్యకాంబ



మైదుకూరులోని శ్రీభీమేశ్వరస్వామి ఆలయంలో అన్నపూర్ణాదేవి అలంకారం






ప్రొద్దుటూరు : రాజరాజేశ్వరిదేవి ఆలయంలో పార్వతీదేవి

## పాహిమాం పరమేశ్వరి

స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం సాయంత్రం శ్రీదేవి వనవిహారినిగా, రాత్రి బిల్వవృక్ష నివాసిని పార్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి సెట్టింగ్, వివిధ దేవతామూర్తుల సెట్టింగ్ అందరిని ఆకట్టుకుంది. రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి వనవిహారిణి (పార్వతీ దేవి)గా భక్తులకు కనిపించింది. వివిధ రకాల పండ్లు, కూరగాయలతో అలంకరణ, దేవతా విగ్రహాలు, బొమ్మలకొలువు అందరిని ఆకట్టుకుంది. చెన్నకేశవాలయంలో మోహిని వనవిహారిణి, ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో, రాజరాజేశ్వరిదేవి ఆలయంలో, శివాలయంలో, పార్వతీదేవిగా, సత్యనారాయణస్వామి ఆలయంలో వైష్ణవి దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. వనాన్ని తలపించేలా ఆలయాలను మొక్కలతో తీర్చిదిద్దారు. అన్ని ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది – ప్రొద్దుటూరు కల్చరల్



బద్వేలు అర్బన్ : అమ్మవారిని దర్శించుకునేందుకు భారీగా తరలివచ్చిన భక్తులు



బద్వేలు అర్బన్ : మహాలక్ష్మి ఆలయంలో సరస్వతిదేవి అలంకారం



బద్వేలు అర్బన్: అమ్మవారిశాలలో దుర్గాదేవి అలంకారంలో అమ్మవారు



కలసపాడు : ఆలయంలో ఏర్పాటు చేసిన తోటోత్సవం



పోరుమామిళ్ల : కోటపోలేరమ్మ తమలపాకుల అలంకారంలో..



పోరుమామిళ్ల : వనవిహారిణిగా వాసవీమాత

## అధిక రేట్లు వసూలు చేస్తే చర్యలు

ప్రొద్దుటూరు క్రైం : దసరా పండుగ సందర్భంగా దూర ప్రాంతాల నుంచి ప్రొద్దుటూరుకు వచ్చే ప్రయాణికులతో అధిక టికెట్ ధరలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని ప్రొద్దుటూరు ఆర్టీఓ మనీషా ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులను హెచ్చరించారు. శుక్రవారం తన చాంబర్‌లో పట్టణంలోని పలువురు ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులతో సమావేశాన్ని నిర్వహించారు. విజయదశమి పండుగను పురస్కరించుకొని హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు, చెన్నై, విశాఖపట్టణం తదితర ప్రాంతాల నుంచి ప్రొద్దుటూరుకు పెద్ద ఎత్తున ప్రయాణికులు వస్తారన్నారు. పండుగ డిమాండును సాకుగా చూపి టికెట్ రేట్లను పెంచరాదని సూచించారు. టికెట్ ధరలు అధికంగా వసూలు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రతి రోజు తనిఖీలు నిర్వహిస్తామని ఆర్టీఓ ఈ సందర్భంగా చెప్పారు. సమావేశంలో ఎంవీఐ నారాయణనాయక్ పాల్గొన్నారు.

**మూడు రెట్లు అధికంగా టికెట్ రేట్లు**

దసరా పండుగ సందర్భంగా 15 రోజుల ముందు నుంచే టికెట్ రేట్లను ట్రావెల్స్ యాజమాన్యాలు పెంచేశాయి. ఇప్పటికే 80 శాతం వరకు ఆన్‌లైన్‌లో టికెట్లను విక్రయించినట్లు తెలుస్తోంది. కొన్ని ట్రావెల్స్ టికెట్ ధరలు మూడు రెట్లు పైగా ఉన్నాయి. సాధారణ రోజుల్లో ప్రొద్దుటూరు నుంచి బెంగళూరుకు సీటింగ్ ధర రూ. 600 ఉండగా ఇప్పుడు రూ. 1500 లకు విక్రయిస్తున్నారు. పెంచిన టికెట్ రేట్లు ఆన్‌లైన్‌లో స్పష్టంగా పొందుపరిచారు. అయినా కూడా రవాణాశాఖ అధికారులు ఇవేవీ పట్టించుకోకుండా నామమాత్రంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ట్రావెల్స్ యాజమాన్యాల దోపిడీ నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

## ముంపు బాధితుల కష్టాలు ప్రభుత్వానికి కనిపించవా?

గోపవరం : సోమశిల వెనుకజలాల కింద ముంపునకు గురైన బొడ్డెచెర్ల, వడ్డెపాలెం దళితవాడ ముంపు బాధితుల కష్టాలు కూటమి ప్రభుత్వానికి కనిపించవా అని మాలమహాసేన రాష్ట్ర కార్యదర్శి మీసాల రవి శుక్రవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. 2008లో దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో సూరేపల్లె దళితవాడకు నష్టపరిహారం చెల్లించారు. అప్పట్లోనే దళితవాడ బాధితులకు పునరావాసం కల్పించాలని జీవో విడుదల చేయడం జరిగిందని, కానీ అప్పటి నుండి ఇప్పటి వరకు దళితవాడ బాధితుల గురించి పట్టించుకున్న నాథుడే లేడన్నారు. అలాగే బొడ్డెచెర్ల, వడ్డెపాలెం, తురకపాలెం గ్రామాలకు 2011లో కమ్యూనికేషన్ కటాఫ్ కింద నష్టపరిహారం చెల్లించారు. ఇళ్లకు మాత్రమే నష్టపరిహారం చెల్లించి భూములకు ఇవ్వలేదన్నారు. పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించకపోవడం వలన బాధితులు ఎవరూ గ్రామాలను విడిచి వెళ్లలేదన్నారు. సోమశిల జలాశయంలోకి నీరు వచ్చినప్పుడల్లా దళితవాడలోకి వెనుక జలాలు వస్తున్నాయని, అధికారులు వచ్చి పరామర్శించి వెళుతున్నారే తప్ప వారికి పునరావాసం కల్పించాలన్న ఆలోచన చేయడంలేదని వాపోయారు. పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించి దళితవాడ బాధితులకు పునరావాసం కల్పిస్తే ముంపు గ్రామాలను విడిచి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కనికరించి దళితవాడ ముంపు వాసులకు పునరావాసం కల్పించాలని, పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

### జగన్‌మోహన్‌రెడ్డికి బాలకృష్ణ క్షమాపణ చెప్పాలి

మైదుకూరు : అసెంబ్లీలో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలపై హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ వెంటనే క్షమాపణలు చెప్పాలని వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు నేట్ల పల్లి శివరాం డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు సభ్య సమాజానికి సిగ్గుచేటని అన్నారు.

### నందమూరి పరువు బజారుకీడ్చిన బాలకృష్ణ

ఖాజీపేట : అసెంబ్లీ సాక్షిగా మాజీ సీఎం వైఎస్ జగన్‌ను సైకో అంటూ అసభ్య పదజాలంతో ఎమ్మెల్యే బాలకృష్ణ మాట్లాడటం నందమూరి వంశ పరువు బజారుకీడ్చడమే అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి విమర్శించారు. దుంపలగట్టులో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సినీ చరిత్రలో రాజకీయాల్లో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావుకు ఎంతో పేరు ఉందన్నారు. చిరంజీవిని వాడు వీడు అని అసెంబ్లీలో మాట్లాడుతుంటే సీఎంగా ఉన్నచంద్రబాబు, స్పీకర్ రాఘురామకృష్ణంరాజు ఖండించక పోవడం దారుణమని విమర్శించారు.

### బాలకృష్ణకు పిచ్చి ముదిరింది

పోరుమామిళ్ల : బాలకృష్ణకు పిచ్చి పీక్స్‌కు చేరిందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్యారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో బాలకృష్ణ సభ్యత, సంస్కారం లేకుండా మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని దూషించడం ఎవ్వరూ అంగీకరించడం లేదన్నారు. తన ఇంట్లో కాల్పులు జరిపినపుడు ఆ కేసు నుండి బయట పడటానికి తనకు మతిస్థిమితం లేదని సర్టిఫికెట్ తెచ్చుకున్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు.

## పోరాట యోధురాలు 'చాకలి ఐలమ్మ'

బద్వేలు అర్బన్ : పెత్తందారులకు, భూస్వాములకు వ్యతిరేకంగా సాయుధ పోరాటాలు కొనసాగించిన యోధురాలు చాకలి ఐలమ్మ అని మహనీయుల ఆశయసాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బి.గురుమూర్తి, పట్టణాభివృద్ధి సొసైటీ అధ్యక్షుడు నానబాల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎన్‌జీఓ హోంలో చిట్యాల ఐలమ్మ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. అట్టడగు వర్గాలైన చేనేత, కుమ్మరి, రజక వంటి వృత్తిదారులను హీనంగా చూస్తున్న దొరలను ముప్పుతిప్పలు పెట్టిన వీరవనిత ఐలమ్మ అని కొనియాడారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చేతివృత్తిదారుల సంఘం పట్టణ కన్వీనర్ నాగార్జున, డీహెచ్‌పీఎస్ జిల్లా నాయకులు పి.వెంకటరమణ, బీసీ సంఘం నాయకులు లక్ష్మీనరసయ్య, బాలగురన్న పాల్గొన్నారు.

### వాసవి మాతను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే దంపతులు



అమ్మవారిశాలలో హారతి తీసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి దంపతులు

మైదుకూరు : మైదుకూరులోని వాసవి కన్యకాపరమేశ్వరిని మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, ప్రభావతమ్మ దంపతులు దర్శించుకున్నారు. శుక్రవారం రాత్రి అమ్మవారిశాలలో ప్రత్యేక అలంకరణలో ఉన్న మూల విరాట్‌కు రఘురామిరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్యసభ నాయకులు రఘురామిరెడ్డి దంపతులను శాలువా, పూలమాలతో సత్కరించి నూతన వస్త్రాలు, అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. ఇదే సమయంలో జెడ్పీటీసీ సభ్యురాలు అట్లూరు ప్రసన్న లక్ష్మీ, ఏవీ సుబ్బారెడ్డి దంపతులు కూడా అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి, పట్టణ అధ్యక్షుడు కేపీ లింగన్న, సింగిల్ విండో మాజీ చైర్మన్ మూలె సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షరీఫ్, భరత్, చొక్కం రమేష్, రామదాసు పాల్గొన్నారు.

## పురోగతికి ప్రణాళిక రూపొందించాలి

చాపాడు : మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల పురోగతికి ప్రణాళిక రూపొందించుకోవాలని ఎంపీపీ తెలిదెల లక్ష్మయ్య పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ పురోగతి సూచిక వెర్షన్ 1.0 నుంచి 2.0కు పరివర్తన వ్యాప్తిపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా శాఖలకు చెందిన అధిఆకరులకు ఒకరోజు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వీరకిశోర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళిక రూపొందించుకుని వెర్షన్ 1.0 నుంచి 2.0కు రూపాంతరం చెందేలా చొరవ తీసుకోవాలన్నారు.పంచాయతీ కార్యదర్శులు సహకారంతో అభివృద్ధి ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ఈఓపీఆర్డీ శివకుమార్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పోషకాహారం తీసుకుంటేనే ఆరోగ్యం



పోషకాహారాన్ని తయారు చేస్తున్న సీడీపీఓ జమీలాబీ

ప్రొద్దుటూరు రూరల్ : బాలింతలు, గర్భిణీలు పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని సోములవారిపల్లె సచివాలయం-2లో ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్‌లో శుక్రవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన మహిళలు ఉన్నప్పుడే శక్తివంతమైన కుటుంబాలు ఉంటాయన్నారు. ఉచిత వైద్య శిబిరాలను ఉపయోగించుకుని మహిళలు ఆరోగ్యవంతులుగా తయారు కావాలన్నారు. ప్రజలు ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు. అనంతరం పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. అనంతరం మహిళలకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఆప్తాలమిక్ ఆఫీసర్ తేజ, హెల్త్ సూపర్‌వైజర్ బీఏ వరప్రసాద్, టీబీ సూపర్‌వైజర్ హుస్సేన్ బాషా, గ్రామ పంచాయతీ కార్యదర్శులు రాజేంద్రప్రసాద్, మహేశ్వరి, సీహెచ్‌ఓలు గంగతులసి, నరసింహా, అంజలి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

**పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం**

కాశినాయన : పౌష్టికాహారం తీసుకోవడం వలన గర్భిణులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని పోరుమామిళ్ల ఐసీడీఎస్ సీడీపీఓ పి.జమీలాబీ తెలిపారు. శుక్రవారం మండలంలోని ఆకులనారాయణపల్లె గ్రామంలో రాష్ట్రీయ పోషణ మాసోత్సవం సందర్భంగా పురుషుల భాగస్వామ్యంతో తండ్రులతో పోషణ చౌక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలోని పురుషులతో సమావేశం ఏర్పాటు చేశారు. స్థానికంగా దొరికే వస్తువులతో పిల్లలకు పోషకాహారాలు ఎలా అందించాలో చేసి చూపించారు. తల్లులు పిల్లలకు జంక్ ఫుడ్ ఇవ్వకుండా తమ ఇంటిలోనే తయారు చేసిన చిరుతిండ్లను వారికి అందించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రకళ, స్థానిక సర్పంచ్ రాములమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.